క్లుప్తంగా

సమస్యలు శాంతియుతంగా పరిష్కరించుకోవాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రహీమ్

మునగపాక: ప్రజా సమస్యలను శాంతియుతంగా పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల ప్రత్యేకాధికారి రహీమ్ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎంఎల్‌సీసీ కార్యక్రమంలో భాగంగా అర్జీదారులతో మాట్లాడారు. వివాదాలకు పోకుండా పెద్దల సమక్షంలో సమస్యలు పరిష్కారమయ్యేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.సత్యనారాయణ,ఎంపీడీవో ఎం.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న శ్రీపతి

మునగపాక: స్థానిక చెరువు కాలువ సంఘ పరిధిలో నిర్మిస్తున్న సత్తెమ్మతల్లి ఆలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి.పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. అనకాపల్లి బైపాస్ రోడ్డులో ఉంటున్న ఇటుక బట్టీ యజమాని కె.శ్రీపతి(కేవీఎస్ హరి) శుక్రవారం రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు బొడ్డేడ అప్పలనాయుడు, ఆడారి జగ్గారావు, వెలగా వెంకటప్పారావు, వెలగా అప్పలనాయుడు, బొడ్డేడ దుర్గునాయుడు, వెలగా జగన్నాథరావు, శిలపరశెట్టి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డులకు ఈకేవైసీ తప్పనిసరి



బి.కె.పల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం వేతనదారులు తప్పనిసరిగా జాబ్‌కార్డులతో ఆధార్‌కార్డులను లింక్ చేసి, ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. బి.కె.పల్లిలో ఉపాధి హామీ పథకం వేతనదారులను కలుసుకుని ఈకేవైసీపై అవగాహన కల్పించారు. ఈకేవైసీ పూర్తయిన వారికి మాత్రమే పని కల్పిస్తారని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌లో వేతనదారులకు సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేస్తారన్నారు. ఈ విధానం వల్ల పారదర్శకతతో పాటు ఒకరి జాబ్‌కార్డులో మరొకరు పనిచేసే అవకాశం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రఘురాం, సర్పంచ్ లింగన్ననాయుడు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు మేలు



బి.కె.పల్లిలో జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: జీఎస్టీ శ్లాబ్ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. బి.కె.పల్లిలో డ్వాక్రా సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించి జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ నూతన జీఎస్టీ విధానంతో పలు వస్తువులపై భారీగా ధర తగ్గిందన్నారు. ప్రతీ వస్తువు కొనుగోలుపై తగ్గిన జీఎస్టీ వివరాలను వర్తకుల నుంచి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

చిప్పాడ నిర్వాసితులకు పట్టాల పంపిణీ

అచ్యుతాపురం: మండలంలోని చిప్పాడ ఆర్ అండ్‌ఆర్ కాలనీ పరిధిలోని నిర్వాసితులకు శుక్రవారం పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ చేతుల మీదుగా 45 మందికి పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు,నిర్వాసితులు,కూటమి నేతలు పాల్గొన్నారు.

స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

నియోజక వర్గ పరిధిలోని యువతకు సెజ్ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సూచించారు.అచ్యుతాపురం సెజ్‌లోని ఏపీఐఐసీ కార్యాలయంలో శుక్రవారం కంపెనీల ప్రతినిధులతో మాట్లాడారు.

రద్దీగా బస్సులు... విద్యార్థుల అవస్థలు



అడ్డురోడ్డులో బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న మహిళలు

- అరకొర బస్సులతో నరకయాతన
- తప్పని ఫుట్ బోర్డు ప్రయాణం
- ఆర్థిక భారమైనా ఆటోలను ఆశ్రయిస్తున్న స్టూడెంట్స్

ఎస్.రాయవరం: మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు ఉదయం, సాయంత్రం వేళల్లో సకాలంలో సరిపడా బస్సులు లేక ప్రయాణికులు ముఖ్యంగా విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు **వెళ్లాలంటే ఆర్టీసీ బస్సుల్లో నిత్యం నరకం చవిచూస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఫుట్ బోర్డుపై వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టిన తరువాత వారి సమస్యలు మరింత రెట్టింపు అయ్యాయి.** ఉదయం పూట ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు, వ్యాపారులు, రోజువారీ కూలీలు పెద్ద ఎత్తున వెళ్తుంటారు. సాయంత్రం వేళ తమ పనులు ముగించుకుని తిరిగి తమ ప్రాంతాలకు చేరుకుంటారు. ప్రయాణికులకు సరిపడా బస్సులు లేకపోవడంతో కిక్కిరిసిన బస్సుల్లోనే తప్పని పరిస్థితుల్లో విద్యార్థులు ఫుట్ బోర్డు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

రద్దీకి అనుగుణంగా పెరగని బస్సులు

పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు మండలం నుంచి మూడు వందలకు పైగా విద్యార్థులు నిత్యం సమీప పట్టణాలైన తుని,పాయకరావుపేట, యలమంచిలి, అనకాపల్లి, అడ్డురోడ్డు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. బడిబస్సు ఉన్నా , సాధారణ బస్సుల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రయాణిస్తారు. స్త్రీ శక్తి పథకంలో ఉన్న బస్సులు కిక్కిరిసి పోతుండడంతో విద్యార్థులు ఈ బస్సులు ఎక్కేందుకు వీలు కుదరడంలేదు. దీంతో నిర్ణీత **సమయానికి , కళాశాలలకు, పాఠశాలలకు వెళ్లలేక పోతున్నామని ఆవేదన చెందుతున్నారు. స్త్రీ శక్తి పథకంలో ప్రయాణికులు రద్దీ పెరిగినా, పాత షెడ్యూల్ ప్రకారం మాత్రమే బస్సులు నడుపుతున్నారు. బస్సు ప్రారంభమయ్యే అనకాపల్లి, పాయకరావుపేటల్లోనే ఫుల్ అవుతున్నాయి. ఈ రూట్లలో పది** పల్లె వెలుగు, రెండు మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు మాత్రమే తిరుగుతున్నాయి. ఎస్.రాయవరం, పాయకరావుపేట, నక్కపల్లి మండలాల నుంచి గతంలో రోజూ సుమారు 1,500 మంది వరకూ వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారు. ఉచిత బస్సు పథకం అమలైన తరువాత ఈ సంఖ్య 2,500 వరకూ పెరిగింది. దీంతో బస్సులు విపరీతమైన రద్దీతో నడుస్తున్నాయి. అయినా బస్సుల సంఖ్య పెంచలేదు.

అడ్డురోడ్డు కేంద్రంగా ఐదు ప్రైవేటు కళాశాలు, నక్కపల్లిలో రెండు ప్రభుత్వ కళాశాలలు, పాయకరావుపేట నాలుగు ప్రభుత్వ, ఆరు ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. యలమంచిలిలో రెండు ప్రభుత్వ, 8 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. అడ్డురోడ్డు నుంచి తుని వైపు 23 కిలో మీటర్లు, యలమంచిలి వైపు 18 కిలో మీటర్ల దూరం కళాశాలలకు, పాఠశాలకు నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు వెళ్లి వస్తుంటారు. విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా అదనపు బస్సులు నడపాలని నర్సీపట్నం, అనకాపల్లి డిపో మేనేజర్లకు విద్యార్థి సంఘాల నాయకులు గతంలో వినతిపత్రాలు అందజేశారు. అయినా పట్టించుకునే నాథుడేకరవయ్యాడు.



అడ్డురోడ్డులో బస్సు ఎక్కేందుకు క్యూలో కూర్చొన్న మహిళలు



బస్సు డోర్ వద్ద వేలాడుతూ కళాశాలకు వెళుతున్న విద్యార్థులు

ప్రమాదకరంగా ప్రయాణం



సరిపడా బస్సులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, బస్సుల సంఖ్య పెంచాలని స్త్రీ శక్తి పథకం అమలు కాకముందు నర్సీపట్నం , అనకాపల్లి డిపోల మేనేజర్లకు వినతి పత్రాలు ఇచ్చాం . ఈ పథకం అమలైన తరువాత విద్యార్థుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఉదయం, సాయంత్రంల్లో బస్సులు ఎక్కలేక కొందరు ఆటోల్లో వస్తున్నారు. మరికొందరు తప్పనిసరి పరిస్థితుల్లో ఫుట్ బోర్డుపై వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. రద్దీ దృష్ట్యా బస్సులను స్టాప్‌లలో కూడా ఆపడంలేదు.

ఎం.బాలాజీ , ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ,రేవుపోలవరం

కుటుంబానికి ఆర్థిక భారం



మాది రేవుపోలవరం గ్రామం. అడ్డురోడ్డు వరకు బడిబస్సులో 9 కిలో మీటర్ల దూరం ప్రయాణం చేస్తాను. అడ్డురోడ్డు నుంచి నక్కపల్లి కళాశాలకు వెళ్లేందుకు పల్లె వెలుగు బస్సు ఎక్కాలి. ఆ బస్సుల్లో కాలుపెట్టడానికి కూడా ఖాళీ ఉండడం లేదు. బస్సులు ఎక్కలేని సమయంలో ఆటోలు ఆశ్రయించి వెలుతున్నాను. కటుంబానికి ఖర్చులు పెరుగుతున్నాయి.

పిక్కి కల్యాణ్, ఇంటర్ మొదటి సంవత్సరం,నక్కపల్లి ప్రభుత్వ కళాశాల

అదనపు బస్సులు నడపాలి



మా గ్రామం నుంచి 30 కిలో మీటర్ల దూరంలో ఉన్న యలమంచిలి కళాశాలకు నిత్యం వెళ్లి,రావాలి. రద్దీ కారణంగా బస్సులు ఎక్కాలంటే భయమేస్తోంది. కళాశాలకు వెళ్లి,వచ్చేందుకు తీవ్ర అవస్థలకు గురికావలసి వస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో సాధారణంగానే రద్దీ ఎక్కువగా ఉంటుంది. స్త్రీశక్తి పథకం ప్రవేశపెట్టిన తరువాత రద్దీ మరీ ఎక్కువైంది. కనీసం బస్సులో కాలు పెట్టడానికి కూడా వీలుకావడం లేదు. పాఠశాల, కళాశాల సమయాల్లో విద్యార్థుల కోసం అదనపు బస్సులు నడపాలి.

వాసుపల్లి సిద్ధు, ఇంటర్ మొదటి సంవత్సరం, యలమంచిలి ప్రభుత్వ కళాశాల

కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ



సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల

ఎస్.రాయవరం:ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం కాకుండా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం విజయవంతం కావాలని వైఎస్సార్ సీపీ పాయకరావుపేట సమన్వయకర్త , మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు చేపట్టే కార్యక్రమాన్ని ప్రజల్లో మరింత విస్తృతంగా తీసుకువెళ్లేందుకు, కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని చెప్పారు. అడ్డురోడ్డు నుంచి రామచంద్రపురం వరకు ఉన్న రోడ్డు రోజు రోజుకూ ప్రమాదకరంగా మారుతోందని, హోం మంత్రి ప్రాతినిత్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. హడావుడిగా మొదలు పెట్టిన పేటసూదిపురం రోడ్డును పూర్తి చేయలేదని తెలిపారు. ప్రతిపక్షనాయకుడిపై విమర్శలు చేయడానికే కూటమి నాయకులు అధిక సమయం కేటాయిస్తున్నారని, పరిపాలన గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మధువర్మ, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, మాజీ సర్పంచ్‌లు అద్దేపల్లి నూకునాయుడు, వియ్యపు వరహాలు, బండి వెంకటరమణ, రామయ్యపట్నం సర్పంచ్ వైబోయిన సత్తిబాబు,ఎంపీటీసీ బొండా దివాణం, పార్టీ నాయకులు వియ్యపు సింహాద్రి, శ్రీనురాజు, కొవ్వూరి చినసూర్యనారాయణరాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాజయ్యపేటకు రామచంద్రయాదవ్ రేపు రాక

నక్కపల్లి: బల్క్‌డ్రగ్‌పార్క్‌కు వ్యతిరేకంగా నిరాహారదీక్ష చేస్తున్న రాజయ్యపేట మత్స్యకారులకు మద్దతుగా బీసీవై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.రామచంద్రయాదవ్ ఆదివారం రాజయ్యపేట రానున్నారు. ఈనెల 5వతేదీన రామ చంద్రయాదవ్ రాజయ్యపేట వస్తుండగా రాజమండ్రి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. రాజయ్యపేట వెళ్లేందుకు అనుమతి లేదంటూ వెనక్కి పంపించేశారు. దీంతో ఆయన రాజయ్యపేటలో మత్స్యకారులను కలిసేందుకు అనుమతి ఇవ్వాలంటూ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. రాజయ్యపేట వెళ్లేందుకు కోర్టు అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. దీంతో రామచంద్రయాద్ ఆదివారం గ్రామానికి రానున్నట్లు మత్స్యకారులు తెలిపారు.బల్క్‌డ్రగ్‌పార్క్‌కు వ్యతిరేకంగా జరిగే నిరాహరదీక్షలో ఆయన పాల్గొంటారని వారు చెప్పారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ఉద్యమం



యలమంచిలిలో సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

యలమంచిలి రూరల్ : దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒకేసారి 17 మెడికల్ కాలేజీల ఏర్పాటు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే జరిగిందని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. శుక్రవారం సాయంత్రం యలమంచిలి పార్టీ కార్యాలయంలో సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.8వేల కోట్లతో వైద్య కళాశాలలు, వాటికి అనుబంధంగా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మించడానికి శ్రీకారం చుడితే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరించడానికి తెగబడుతోందని చెప్పారు.ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యలమంచిలి నియోజకవర్గంలో లక్ష సంతకాలను సేకరిస్తామని తెలిపారు. దీనికి అందరూ సహకరించాలని కోరారు. కేవలం వైఎస్ జగన్‌కు పేరొస్తుందన్న ఒకే ఒక్క కారణంతో చంద్రబాబునాయుడు పీపీపీ విధానం అంటూ వాటిని తమ అనుయాయులకు కట్టబెట్టడానికి చూస్తున్నారన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ద్వారా మంత్రులు,ప్రభుత్వ పెద్దలు బాగా సంపాదించడానికి ప్రణాళిక వేసుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వైద్య కళాశాలలు నిర్వహిస్తే పేద విద్యార్థులు ఏడాదికి కేవలం రూ.15 వేల ఫీజుతో చదువుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామన్నారు.మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్,జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి రాము,వైఎస్సార్‌సీపీ పట్టణ,మండల అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్యదొర, కొల్లి త్రినాథరావు,జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఉద్దండం త్రినాథరావు,మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా,నెట్టెం సత్యనారాయణ,రాజాన మహాలక్ష్మి,రాపేటి సంతోష్, దాసరి కుమార్,కొత్తపేట సర్పంచ్ వానపల్లి లత,వానపల్లి జగన్,ఆడారి అచ్చియ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

27వ రోజు కొనసాగిన మత్స్యకారుల దీక్ష



నిరాహారదీక్షలో పాల్గొన్న వీసం రామకృష్ణ

నక్కపల్లి: బల్క్‌డ్రగ్‌పార్క్‌ను వ్యతిరేకిస్తూ రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న నిరాహారదీక్ష 27వ రోజు కొనసాగింది. శుక్రవారం ఈ దీక్షలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ మాట్లాడుతూ మత్స్యకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న బల్క్ డ్రగ్ పార్క్ వ్యవహారం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు.

గ్రామస్తులు, మత్స్యకారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్లాలని, మెజార్టీ ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ వారికి అండగా నిలవాలని సూచించారన్నారు. మత్స్యకారుల డిమాండ్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని, బల్క్‌డ్రగ్‌పార్క్ ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. బల్క్ డ్రగ్‌పార్క్ పేరుతో రాబోయే రోజుల్లో ఇక్కడ వందలాది రసాయన కంపెనీలు ఏర్పాటుచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే గ్రామంలో చాలామంది క్యాన్సర్, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారన్నారు. ప్రభుత్వం అభివృద్ధికంటే ప్రజల ప్రాణాలకు ప్రాధాన్యంఇవ్వాలన్నారు. మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు వైఎస్సార్‌సీపీ తరఫున పూర్తి మద్దత్తు ఇస్తున్నామన్నారు. మిగిలిన పార్టీలు రాజకీయాలకతీతంగా మద్దతు ఇచ్చి, మత్స్యకారులకు అండగా నిలవాలని పిలుపు నిచ్చారు.ఈదీక్షలోనాయకులు పిక్కి తాతీలు, ఎరిపల్లి నాగేశు, సోమేష్, మైలపల్లిసూరిబాబుబాబ్జి తదితరులుపాల్గొన్నారు.

ఉప్పరాపల్లి పాఠశాలకు లేజర్ ప్రింటర్ వితరణ



పాఠశాలకు లేజర్ ప్రింటర్ అందజేస్తున్న అప్పలనాయుడు

ఎస్.రాయవరం: దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పరాపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ అన్నారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ మెడికల్ అండ్ హెల్త్ అదనపు అధికారి అప్పలనాయుడు విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు లేజర్ ప్రింటర్‌ను వితరణగా అందజేశారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం మాట్లాడారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందే..



యండపల్లిలో బాణసంచా తయారీ యూనిట్ యజమానికి సూచనలు ఇస్తున్న ఎస్ఐ

కోటవురట్ల: బాణసంచా తయారీలో నిబంధనల ప్రకారం భద్రతా ప్రమాణాలు పాటించాలని తహసీల్దారు తిరుమలబాబు ఆదేశించారు. యండపల్లి శివారున ఉన్న బాణసంచా తయారీ యూనిట్‌ను తహసీల్దారు తిరుమలబాబు, ఎస్ఐ రమేష్, ఫైర్ సిబ్బంది శుక్రవారం తనిఖీ చేశారు. షెడ్లు, తయారీ విధానం, ఫైర్ సేఫ్టీ పరికరాలను పరిశీలించారు. యజమాని రమణకు భద్రతా చర్యలపై సూచనలు ఇచ్చారు. తహసీల్దారు తిరుమలబాబు మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని బాణసంచా తయారీ యూనిట్లను తనిఖీ చేస్తున్నట్టు తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్సు ప్రకారం అందుకు తగిన పరిమాణంలోనే మందుగుండు తయారు చేయాలన్నారు. కార్మికులందరికీ బీమా తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎక్కువగా ఓపెన్ ప్లేస్‌లోనే మందుగుండు తయారు చేయాలని సూచించారు.

బాలికలు పోషకాహారం తీసుకోవాలి



విద్యార్థినులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్న సిబ్బంది



సత్యవరం పాఠశాల్లో వాల్‌పోస్టర్ ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

మునగపాక: మండల వ్యాప్తంగా శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల విద్యార్థినులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా తిమ్మరాజుపేటలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అన్నపూర్ణ,మీరాబీలు మాట్లాడుతూ బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని తెలిపారు. హెచ్ఎం జి.అప్పారావు, ఉపాధ్యాయులు తులసి, శైలజ, అంగన్‌వాడీ టీచర్ సత్యవతి, మహిళా పోలీసు పుష్పలత తదితరులు పాల్గొన్నారు. మునగపాక పీహెచ్‌సీలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ నాగలక్ష్మి ఈ సందర్భంగా బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేంకటేశ్వర గీతా ప్రచార సమితి కన్వీనర్ శరగడం పరదేశినాయుడు పాల్గొన్నారు.

పాయకరావుపేట: బాలికలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ రంజాన్ బీబీ అన్నారు. బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని సత్యవరం, మంగవరం, గుంటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో విద్యార్థినులకు బాల్య వివాహాలు, బాలల హక్కులు, సైబార్ నేరాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు ఆరోగ్యం శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పాఠశాలలు, రేషన్‌డిపోల తనిఖీ



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు



పాయకరావుపేటలో ఎంఎల్‌సీ పాయింట్‌ను తనిఖీ చేస్తున్న కాంతారావు



ఎస్.రాయవరంలో 4వ నంబర్ డిపోను తనిఖీ చేస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యుడు

నక్కపల్లి: మండలంలోని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ డిపోలను రాష్ట్ర ఆహార సలహా సంఘ సభ్యుడు కాంతారావు శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా రేషన్‌షాపులను సందర్శించి స్టాక్‌రిజిస్టర్లు పరిశీలించారు. నిత్యావసర సరుకులు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నక్కపల్లిలో వీవర్స్‌కాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో ఉన్న రేషన్ డిపోలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం స్థానిక బాలికోన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థినుల కోసం వండిన ఆహారపదార్థాలను పరిశీలించారు. విద్యార్థినులు, మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులతో మాట్లాడారు. రేషన్‌డిపోల వల్ల, మధ్యాహ్నభోజనం పథకం వల్ల ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తనకు ఫిర్యాదు చేయాలన్నారు. రేషన్‌డిపోల్లో సరుకుల తూకంలో తేడాలు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరుకులు పక్కదారిపట్టకుండా చూడాలన్నారు. ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు, ఎంఈవో కుంచం నరేష్, సీఎస్‌డీటీ శ్రీపాద ప్రసాద్,ఎంఈవో-2 నాగన్నదొర, హెచ్ఎంలు శ్రీలక్ష్మి, విజయ పాల్గొన్నారు.

పాయకరావుపేట: పట్టణంలోని ఎంఎల్‌సీ పాయింట్‌ను రాష్ట్ర ఆహార సలహా సంఘ సభ్యుడు కాంతారావు శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. అనంతరం బాలికల వసతి గృహాన్ని సందర్శించి, భోజనం ఏవిధంగా ఉందని బాలికలను అడిగి తెలుసుకున్నారు. 6, 40 వ నంబర్ల రేషన్ డిపోలను పరిశీలించారు. తహసీల్దార్ ఎస్.మహేశ్వరరావు, సీఎస్‌డీటీ గణపతిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: రేషన్ డిపోల డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా లేకపోతే సహించేది లేదని రాష్ట్ర ఆహార సలహా సంఘ సభ్యుడు కాంతారావు తెలిపారు. ఎస్.రాయవరం మండలంలో డిపో నెంబర్ 4, 27లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. డిపో నంబర్ 4 వద్ద పరిసరాలు సరిగా లేవని, డిపో నంబర్ 27 లో బియ్యం ఎక్కువగా నేలపై పడేసి ఉన్నాయని మండిపడ్డారు. ఈ డీలర్లపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సిఫారసు చేయనున్నట్టు ఆయన చెప్పారు. ఈ పరిశీలనలో యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

అనకాపల్లి: వీవోఏల సమస్యలను పరిష్కరించాలని ఏపీ వెలుగు విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్(సీఐటీయూ) జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు సీహెచ్.రూపాదేవి, ఎస్.వెంకటలక్ష్మి కోరారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వారు మాట్లాడారు. జిల్లాలో 1,292 మంది వీవోఏలు, 39,579 మంది స్వయం సహాయక సంఘాలను ఆర్గనైజ్ చేస్తున్నారని తెలిపారు. 20 సంవత్సరాలుగా ప్రభుత్వాల ద్వారా ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీవోఏలకు ఇస్తున్న గౌరవ వేతనాలను ప్రతి నెలా 5వ తేదీలోపు ఇవ్వాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా వేతనాన్ని పెంచాలన్నారు. గ్రూపు ఇన్సూరెన్స్, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు.